క్లుప్తంగా

కాగితపు గుజ్జుతో గణపతి ఉత్సవ విగ్రహం

బోట్‌క్లబ్‌: ఈ సంవత్సరం గణేశ నామ ప్రతుల కాగితపు గుజ్జుతో గణపతి ఉత్సవ విగ్రహం తయారు చేస్తున్నట్లు భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. భోగి గణపతి పీఠానికి ఇద్దరు కళాశాల విద్యార్థినులు భక్తి శ్రద్ధలతో ఓం గం గణపతయే నమః అని రాసిన లక్షనామాల ప్రతులను సోమవారం భోగిగణపతి పీఠంలో అందించారు. స్వయంభువుకు కవచ యజ్ఞం చేపట్టిన దృష్ట్యా కాగితం గుజ్జుతో భోగిగణపతి ఉత్సవ విగ్రహం తయారుచేసేందుకు అధిక సంఖ్యలో గణపతి నామ ప్రతులను గణేశ ఆరాధకుల నుంచి సేకరిస్తున్నామన్నారు. సెప్టెంబర్‌ 18 నుంచి 26 వరకూ గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్‌ 27న గణేశ నిమజ్జనం శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. భోగిగణపతి పీఠంలో సెప్టెంబర్‌ 4న రాటముహూర్తం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా పవిత్రోత్సవం

బోట్‌క్లబ్‌: స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్‌ కాలనీలో ఉన్న రమా సహిత సత్యదేవ మందిరంలో సోమవారం పవిత్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మందిర పురోహితులు యాతగిరి మధ్వేష్‌ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మనకు తెలియకుండా చేసే ఎన్నో దోషాల నివారణకు ఈ పవిత్రోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భగవంతునికి మూర్తులతో పాటు సాలిగ్రామాలకు పట్టుదారాలతో తయారుచేసిన పవిత్రాలను అలకరించినట్లు చెప్పారు.

వెండి సర్పం సమర్పణ



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి చేయించిన వెండి నాగసర్పం

బోట్‌క్లబ్‌: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అనపర్తికి చెందిన సత్తి నాగేశ్వరరెడ్డి వెండి నాగసర్పాన్ని సమర్పించారు. సోమవారం ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డికి దాత దానిని అందించారు. రూ.75 వేల విలువైన వెండితో దీనిని తయారుచేయించినట్లు ఈఓ తెలిపారు. అనంతరం ఆలయ అర్చకుడు నాగాభరణానికి సంప్రోక్షణ చేసి స్వామికి అలంకరించారు. దాతకు ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

అంధుల ఆశ్రమంలో బియ్యం పంపిణీ

కాకినాడ రూరల్‌: అచ్చంపేట జంక్షన్‌ వద్ద రెడ్‌ క్రాస్‌ అంధ బాలల ఆశ్రమంలో లయన్స్‌ క్లబ్స్‌ ఇంటర్నేషనల్‌, లయన్స్‌క్లబ్‌ కాకినాడ ఫ్రెండ్స్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ వేలూరి సూర్యనారాయణ, సత్యవతి దంపతులు బియ్యం పంపిణీ చేశారు. గవర్నర్‌ అధికారిక పర్యటనలో భాగంగా రమణయ్యపేటలోని ఫ్రెండ్స్‌ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులు సూర్యనారాయణ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం పార్కులో మొక్కలు నాటి, ముగ్గురు పేద మహిళలకు కుట్టు మిషన్లను అందించారు. లయన్స్‌ క్లబ్‌ కాకినాడ ఫ్రెండ్స్‌ అధ్యక్షుడు ఆదినారాయణమూర్తి, డీసీఎస్‌ సతీష్‌, డీసీటీ దత్తు, జెడ్‌సీ కటకం శ్రీనివాస్‌, క్లబ్‌ కార్యదర్శి సురేష్‌కుమార్‌, కోశాధికారి శ్రీనివాస్‌, చార్టర్‌ ప్రెసిడెంట్‌ గంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ పోరాట అమరవీరులకు నివాళి

కాకినాడ సిటీ: విద్యుత్‌ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్‌ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వామపక్షనేతలు పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్యభవన్‌లో విద్యుత్‌ అమరవీరులు సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు నివాళులర్పించారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీర్‌బాగ్‌ ప్రజా మహాప్రదర్శనలో చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండలో ముగ్గురు అమరులయ్యారని, నాటి ఉద్యమం ఫలితంగా పాలకులు చాలా ఏళ్ల పాటు విద్యుత్‌ చార్జీలు పెంచలేదన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న, సీపీఎం నాయకులు ఎం రాజశేఖర్‌, రాజగోపాల్‌, దువ్వా శేషుబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు వేదిక ఎన్‌ఎస్‌ఎస్‌

బాలాజీచెరువు: విద్యార్థి దశలో సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణకు ఎన్‌ఎస్‌ఎస్‌ మంచి వేదిక అని ఉమ్మడి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్‌ జిల్లా మాజీ కో–ఆర్డినేటర్‌ డాక్టర్‌ పీవీ కృష్ణారావు పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్‌ అవగాహన తరగతులు నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ రక్తదాన అవశ్యకత, విద్య ప్రాముఖ్యత వంటి విషయాలపై యువత ప్రచారం చేయాలని సూచించారు. కళాశాల అకడమిక్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బీఈవీఎల్‌ నాయుడు, కో–ఆర్డినేటర్‌ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు కురసాల, ద్వారంపూడి

కాకినాడ రూరల్‌: నవరత్న పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నగరంలోని 1వ డివిజన్‌ రమణయ్యపేట గొల్లపేటలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. రమణయ్యపేట మార్కెట్‌ వద్ద కనకదుర్గమ్మ ఆలయం నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నివాసం వరకు పలు వీధుల్లో గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. పలువురు ప్రస్తావించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులకు చెప్పి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పేదలకు న్యాయం చేసే లక్ష్యంతోనే సంక్షేమ పథకాలు అమలుకు పలుసార్లు అవకాశం ఇస్తుండడంతో పథకాలు మధ్యలో నిలిచిపోయినవారు, వర్తించినవారు నిబంధనలు సడలింపు కారణంగా లబ్ధి పొందుతున్నారన్నారు. టీపీఆర్వో కృష్ణమోహన్‌, ఏఈ రమేష్‌, సచివాలయం సిబ్బంది, 1వ డివిజన్‌ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ వాసిరెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కాకినాడ: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 32వ డివిజన్‌ ఎర్రరోడ్డు సత్యప్రసన్న నగర్‌, వెంకటరత్నాపురం ప్రాంతాల్లో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేసే దిశగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారని ద్వారంపూడి అన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలన అందించి దేశమంతా మన రాష్ట్రం వైపు చూసేలా పరిపాలిస్తున్నారని ఆయన అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్‌ రోకళ్ల సత్యనారాయణ, వక్ఫ్‌ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్‌, నూకాలమ్మగుడి చైర్‌పర్సన్‌ కొయ్యా సత్యనారాయణరెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

పార్కుల్లో మెరుగైన వసతులు



బోట్‌క్లబ్‌ పార్కులో వాకర్లు, స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో ఏడీసీ నాగనరసింహారావు, తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 50వ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

కాకినాడ రూరల్‌: నగరంలోని తన నియోజకవర్గ పరిధిలోని పార్కుల్లో మెరుగైన వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు రూరల్‌ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట 1వ డివిజన్‌లో బోట్‌క్లబ్‌ పార్కు సందర్శనతో పాటు 50వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్న పార్కు పనులను సోమవారం కార్పొరేషన్‌ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తొలుత బోట్‌క్లబ్‌ పార్కును సందర్శించి అక్కడ వాకర్స్‌తో పాటు ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోట్‌క్లబ్‌లో పచ్చిక తొలగింపు, లైట్లు, పిచ్చి మొక్కలు తొలగింపుతో పాటు పార్కింగ్‌, వర్షం వస్తే తలదాచుకునేందుకు షెడ్‌ ఏర్పాటుపై వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఏడీసీ నాగనరసింహారావుతో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. పార్కుకు వచ్చే వారు తమ బైక్‌లు బయట వదులుతున్నారని, దీని వల్ల వాటికి రక్షణ లేకపోవడంతో పాటు రమణయ్యపేట మార్కెట్‌పై ట్రాఫిక్‌ సమస్య ఏర్పడుతున్నందున వాహనాలు లోపల పార్కింగ్‌ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. స్మార్ట్‌ సిటీ, కార్పొరేషన్‌ నిధులతో చేపడుతున్న పనులు త్వరిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏడీసీ నాగనరసింహారావు మాట్లాడుతూ పార్కులో పిచ్చిమొక్కల నిర్వహణకు ఏర్పాటుచేసిన ఏజెన్సీ పనితీరు సక్రమంగా లేనందున వారికి జరిమానా విధిస్తామని, క్యాంటీన్‌ స్థానంలో రీడింగ్‌ రూమ్‌ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌ఈ సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 50వ డివిజన్‌ బ్యాంక్‌ కాలనీ పార్కులో రూ.50 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిపై అధికారులతో సమీక్షించారు. డీఈ సుబ్బారావు, ఏఈ రమేష్‌బాబు, మాజీ కార్పొరేటర్‌ ఐ.శ్రీను, ఒకటో వార్డు వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జి వాసురెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి 'గుడాల' కృషి

- ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి, బాబూరావు



కృష్ణ సంతాప సభలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎస్సీ కార్పొరేషన్‌ విశ్రాంత ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ దివంగత గుడాల కృష్ణ ఎంతగానో పాటుపడ్డారని ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, గొల్ల బాబూరావు పేర్కొన్నారు. ఇటీవల గుడాల కృష్ణ మృతి చెందగా సోమవారం ఆయన నివాసం వద్ద జరిగిన సంతాప సభలో వీరు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఆయన పదవీ విరమణ అనంతరం కూడా మరింత అంకిత భావం, సేవా తత్పరతతో దళిత సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. గుడాల కృష్ణ కుమారుడు గుడాల శ్రీనివాస్‌కు తమ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కౌడా వైస్‌ చైర్మన్‌ సుబ్బారావు, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్‌ జేడీ పవన్‌కుమార్‌, దళిత ఉద్యమనేత జేబీ రాజు, దళిత నాయకులు పిల్లి రామారావు, ఎ.రామేశ్వరరావు, టి.నూకరాజు, బీఎం పవన్‌కుమార్‌, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యరూపకాలు



నృత్యరూపకం ప్రదర్శిస్తున్న నాట్య బృందం



నాట్యభారతి పురస్కారాలు స్వీకరిస్తున్న శ్రీ జనని నృత్యనికేతన్‌ విద్యార్థినులు

కాకినాడ కల్చరల్‌: స్థానిక సూర్యకళామందిర్‌లో ఋషిపీఠం చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో శివపదం పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కళాపోటీలు నిర్వహిస్తున్నారు. సామవేదం షణ్ముఖశర్మ స్వరపరిచిన శివకీర్తనకు అనుగుణంగా నృత్య రూపకాలు ప్రదర్శించాయి. నాట్యాచార్య హరిలోకేష్‌ ఆధ్వర్యంలో నృత్యాంజలి నాట్య బృందం, నాట్యాచారిణి నాగమణి శిష్య బృందం, శారదా నిలయం విద్యార్థుల నృత్య బృదం, నాట్యాచార్య రమేష్‌ నాయుడు నృత్య బృదం విద్యార్థులు చక్కని ప్రదర్శనలు ఇచ్చారు. న్యాయనిర్ణేతలుగా నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాసశర్మ, హేమచందర్‌లు వ్యవహరించారు. నృత్యపోటీలు మంగళవారంలో ముగుస్తాయని నిర్వాహకులులాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. ట్రస్టు కన్వీనర్‌ దావలి రామ్మూర్తి, రామచంద్రరావు, ట్రస్టు సభ్యులు, తల్లిదండ్రులు తదితరుల పాల్గొన్నారు.

నృత్యభారతి పురస్కారం ప్రదానం

స్థానిక శ్రీజనని నృత్యనికేతన్‌ విద్యార్థినులకు నృత్యభారతి అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. శ్రీనటరాజ్‌ నృత్యనికేతన్‌, శ్రీలలిత కళా నృత్యనికేతన్‌ సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ సంగీత నృత్యోత్సవం పేరుతో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మంగళవారం నృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన నృత్యనికేతన్‌ విద్యార్థినులు సమీర, సహస్ర, పూజిత, అపూర్వ, దేవిక చక్కని ప్రదర్శనతో మెప్పించారు. వీరికి నిర్వాహకులు అరవ అంజనేయులు నృత్యభారతి అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. నాట్యాచారిణి పి.రమాదేవికి సంగీత శిక్షణా కౌశల పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు.

సమష్టి కృషితోనే రెండో స్థానం

- స్మార్ట్‌ సిటీ ఎండీ నాగనరసింహారావు
- అవార్డు రావడంపై స్వీట్ల పంపిణీ



కార్పొరేషన్‌ కార్యాలయంలో కేక్‌ కట్‌ చేస్తున్న కమిషనర్‌ నాగనరసింహారావు, వివిధ శాఖల అధికారులు

కాకినాడ: ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి వల్లే ఇండియన్‌ స్మార్ట్‌ సిటీ అవార్డ్స్‌–2022లో కాకినాడ రెండవ స్థానంలో నిలిచిందని స్మార్ట్‌సిటీ ఎండీ, సీఈవో, కార్పొరేషన్‌ కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు పేర్కొన్నారు. పారిశుధ్య విభాగంలో రెండో స్థానంలో నిలవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం కేక్‌కట్‌ చేసి అధికారులు, ఉద్యోగులకు స్వీట్లు పంచారు. కలెక్టర్‌ కృతి కాశుక్లా, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్‌, పారిశుధ్య విభాగం, స్మార్ట్‌సిటీ యంత్రాంగం, ప్రత్యేకాధికారులు, సూపర్‌వైజరీ అధికారులు సమన్వయంతో చేసిన కృషి వల్ల కాకినాడకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు. రానున్న రోజుల్లో ప్రథమస్థానంలో నిలిచేందుకు మరింత అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. వచ్చేనెల 27న భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ఈ అవార్డు అందజేయనున్నారని, ఇది కార్పొరేషన్‌, స్మార్ట్‌సిటీల సమష్టి విజయమన్నారు. నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్‌ కోన శ్రీనివాస్‌, ఎంహెచ్‌వో డాక్టర్‌ పృథ్వీచరణ్‌, డీసీపీ హరిదాస్‌, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్‌ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్‌, ఏవో సిటీ ఎ. ఆర్వో చక్కా రమణ, డీఈ మాధవి, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

స్థానిక కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం డయల్‌ యువర్‌ కమిషనర్‌, స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది వివిధ సమస్యలపై ఫోన్‌ ద్వారా కమిషనర్‌కు సమస్యలు విన్నవించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డెబ్రిస్‌ తొలగింపు, వీధి దీపాల నిర్వహణ వంటి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్‌ అధికారులను ఆదేశించారు. కమిషనర్‌ మాట్లాడుతూ న్యాయపరమైన వివాదాలు, ఆర్థిక పరమైన అంశాలు మినహా ఇతర సమస్యలు అన్నింటిని ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరిస్తున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ప్రక్రియను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివిధ విభాగాల అధికారులు, డీఈలు, ఏఈలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కన్నయ్య దొరబాబుకు 'సేవా ఆరోగ్యమిత్ర'



ఉత్తమ ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని అందుకుంటున్న దొరబాబు

కాకినాడ సిటీ: డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో ఆరోగ్య మిత్రగా అందించిన సేవలకుగాను స్థానిక ఇనోదయ ఆస్పత్రికి చెందిన తెల్లపు కన్నయ్య దొరబాబుకు రాష్ట్ర ప్రభుత్వం సేవా ఆరోగ్య మిత్ర పురస్కారాన్ని అందజేసింది. జూలై నెలకు గాను ఆయనకు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ కృతికా శుక్లా ప్రశంసా పత్రం, రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ పి.రాధాకృష్ణ, మేనేజర్‌ నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల వితరణ



కరపలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న బాబు, హెచ్‌ఎం స్వర్ణరాణి

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల వితరణతో ప్లస్‌ టు (ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల) విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సమకూరాయి. 1987–88 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు రూ. 35 వేలు విలువ చేసే పాఠ్యపుస్తకాలు సమకూర్చగా సోమవారం ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణితో కలసి పూర్వ విద్యార్థి మల్లిపూడి బాబు విద్యార్థులకు అందజేశారు. స్టాఫ్‌ సెక్రటరీ ఎం.రమేష్‌, ఉపాధ్యాయులు నక్కా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కరప: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల ఎండీయూ ఆపరేటర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సమాఖ్య పిలుపు మేరకు మండలంలోని ఆపరేటర్లు సోమవారం తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్దిసేపు ధర్నా చేసి, నినాదాలు చేశారు. ఎండీయు ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌ కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావుకు అందజేశారు. మండల ఎండీయూ ఆపరేటర్ల సంఘం నాయకులు ఎస్‌.గంగాధర్‌, పి.వీరవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్పర్శ'పై అవగాహన పెంచాలి

- కలెక్టర్‌ కృతికా శుక్లా
- వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్‌ కృతికా శుక్లా, స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులు

కాకినాడ సిటీ: బాల బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా లేక తాకరాని ప్రదేశాల్లో తాకినా వెంటనే వారి తల్లిదండ్రుకు గాని, టీచర్లకు గాని, చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098కి గాని ఫోన్‌ చేసి చెప్పాలని కలెక్టర్‌ కృతికా శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షితమైన స్పర్శ–అసురక్షితమైన స్పర్శ'పై వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ వాల్‌పోస్టర్లను జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో అందరికీ కనబడేలా అతికించాలని కలెక్టర్‌ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామ మహిళా పోలీస్‌తో ఈ అంశంపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారిణి కె.ప్రవీణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్‌ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల అప్పగింతకు సన్నాహాలు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



టిడ్కో గృహాలను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: టిడ్కో లబ్ధిదారులకు సెప్టెంబర్‌ మొదటి లేదా రెండో వారంలో అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన స్థానిక పర్లోపేటలోని టిడ్కో ఇళ్లను సందర్శించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని, ఏర్పాట్లను పరిశీలించారు. టీడీపీ పాలనలో టిడ్కో ఇళ్లను ప్రతిపాదించినప్పటికీ పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించలేక పోయారన్నారు. కాకినాడలో తొలివిడత సుమారు 1410 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌ చేతుల మీదుగా ఈ ఇళ్లను సెప్టెంబర్‌ మొదటి, లేదా రెండో వారంలో ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.

డిసెంబర్‌ నాటికి అభివృద్ధి పనులు పూర్తి

వచ్చే డిసెంబర్‌ నాటికి నగరంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా నగరంలో పర్యటించి అవసరమైన అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. పెండింగ్‌ పనులను డిసెంబర్‌ నాటికి పూర్తిచేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రైన్లు, విద్యుదీకరణ, ఇతర మౌలిక సదుపాయాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్‌ కన్వీనర్‌ సుంకర విద్యాసాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష అధ్యయనం అవసరం



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసిన సాహితీవేత్తలు

కాకినాడ సిటీ: మాతృభాషను అధ్యయనం చేయకుండా ఇతర భాషల అర్థం చేసుకోలేరని విశ్రాంత తెలుగు పండితుడు కాకరపర్తి దుర్గాప్రసాద్‌ అన్నారు. ఆదివారం రాత్రి యూటీఎఫ్‌ హోంలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతి సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు మరువరానివని అన్నారు. తెలుగు భాషా ఉపాధ్యాయులు కెపెస్‌ ప్రకాశరావు, వెంకటస్వామి విజ్ఞాన కేంద్రం కన్వీనర్‌ కె నత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యూటీఎఫ్‌ నాయకులు ప్రసాదరావు, పి.యోగేశ్వర్‌, యూఎస్‌ఎన్‌ రెడ్డి, మలక వెంకటరమణ, ఎం.వెంకటరమణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధుల మంజూరు



పెద్దాపురప్పాడు శివారు వై.సావరంలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: నియోజకవర్గ పరిధిలో పలు ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. పెద్దాపురప్పాడు శివారు వై.సావరంలో సోమవారం అభయాంజనేయస్వామి ఆలయం, ఎస్సీ పేటలో గొంతెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఉప సర్పంచ్‌ బీరుదా శ్రీనివాస అప్పారావు, సచివాలయం కన్వీనర్‌ నల్లా బాలాజీ, కాదా వెంకటేశ్వరరావు, మార్నె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్‌ బాధితులకు న్యాయం చేయాలి

కాకినాడ సిటీ: అగ్రిగోల్డ్‌ కస్టమర్స్‌ అండ్‌ ఏజెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌ 15న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని అసోసియేషన్‌ జిల్లా ఉపాధ్యక్షులు కొల్లు శ్రీనివాస్‌ తెలిపారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో చలో విజయవాడ అగ్రిగోల్డ్‌ బాధితుల శంఖారావం కరపత్ర ఆవిష్కరణను సీపీఐ నాయకులు కామిరెడ్డి బోడకొండ, టి.ప్రసాద్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. అగ్రిగోల్డ్‌ బాధితులకు, ఏజెంట్లకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దొమ్మేటి రాంబాబు, కర్రి చంద్రశేఖర్‌, సీహెచ్‌ వీర్రాజు, కుత్బుద్దీన్‌, కె.రాజబాబు పాల్గొన్నారు.